క్లుప్తంగా

ఇందిరానగర్‌లో సంక్రాంతి సంబరాలు



పండగ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు ఇందిరానగర్‌లో మోదకొండమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండగను ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు పాల్గొని ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ముగ్గులు పోటీలు, మ్యూజికల్ చైర్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.

మాంసం దుకాణాల వద్ద రద్దీ



గోపాలపట్నం బంక్ జంక్షన్‌లో మాంసం దుకాణాల వద్ద గుమిగూడిన జనం

గోపాలపట్నం: కనుమ పండగ సందర్భంగా గోపాలపట్నం బంక్ వద్ద మాంసం దుకాణాల్లో రద్దీ నెలకొంది. బంక్ జంక్షన్‌లో మాంసం దుకాణాల వద్ద జనం క్యూలైన్లలో వేచి ఉండి, మాంసం కొనుగోలు చేశారు. మటన్ కిలో రూ.1000, స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.250 వరకు అమ్మకాలు సాగాయి.

మరిడిమాంబ పండగ పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న నిర్వాహకులు

మల్కాపురం: జీవీఎంసీ 81వ వార్డు మల్కాపురం గ్రామ దేవత మరిడిమాంబ అమ్మవారి తీర్థం (కాకి అప్పన్న పరస) ఈ నెల 22న నిర్వహించనున్నారు. పరస పోస్టర్‌ను నిర్వాహకులు బుధవారం విడుదల చేశారు. మల్కాపురం, రెడ్డి వీధివద్ద జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు కాకి పోలిరెడ్డి, కాకి రమణారెడ్డి తదితరులు మాట్లాడారు. 22న ఉదయం 6 గంటలకు ఆలయంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలతో పండగ ప్రారంభమవుతుందన్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యపోటీలు, సేవ గరిడీ, సాముగరిడీ వంటివి ఉంటాయని తెలియజేశారు.

మమతకు రామలింగస్వామి పురస్కారం



మమతను సన్మానిస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య: మమత చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు ఎల్లేటి మమతను కొణతాల రామలింగస్వామి పురస్కారం వరించింది. సంక్రాంతి సందర్భంగా అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఈ పురస్కారాన్ని ఆమెకు అందజేశారు. అనకాపల్లి కేంద్రంగా ఉన్న కొణతాల రామలింగ స్వామి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా మూడు రాష్ట్రాల స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన వారిని ఎంపిక చేసి, అవార్డులను అందజేస్తున్నారు. దీనిలో భాగంగా విశాఖపట్నం నుంచి మమత చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఎల్లేటి మమతను ఎంపిక చేశారు. అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తూ, మమత అందరి మన్ననలు పొందుతున్నారు. 90వ వార్డు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్‌గా పనిచేస్తున్న మమత వృద్ధులు, అనాథలను ఆశ్రమానికి తీసుకురావడంతో పాటు, వారికి వైద్య సేవలు అందించి, కుటుంబాల చెంతకు చేర్చేలా ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా మమతను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు.

సంక్రాంతి శోభ



మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో ముగ్గుల పోటీలు



సంక్రాంతి ముగ్గు వేస్తున్న యువతులు



మర్రిపాలెం వుడా లే అవుట్‌లో పూజలందుకున్న గణనాథుడు



మిఠాయి దుకాణాల వద్ద ఆరుబయటే సంప్రదాయ వంటలు చేస్తున్న సిబ్బంది



హెచ్‌పీ మిలీనియం పెట్రోల్ బంక్ వద్ద సంక్రాంతి సెట్



శ్రీహరిపురం సర్వీస్ రోడ్డుపై సంక్రాంతి సెట్



భజన చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

పారిశ్రామిక ప్రాంతం పండగ శోభను సంతరించుకుంది. సేవామార్గాలు, పెట్రోల్ బంక్‌ల్లోనూ సంక్రాంతి కళ కనిపించింది. ఇంద్రధనస్సు ఇలను చేరినట్లుగా యువతులు తీర్చిన రంగుల రంగవల్లికలతో మల్కాపురంలోని మైదాన ప్రాంతం కళకళలాడింది. సంప్రదాయ వస్త్రధారణలో పిల్లలు, పెద్దలు సందడి చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీహరిపురం సర్వీస్ రోడ్డులోని శ్రీనివాస్ స్వీట్ స్టాల్ వద్ద, ఆర్‌కే పురం వద్ద గల హెచ్‌పీ మిలీనియం పెట్రోల్ బంక్ వద్ద నిర్వాహకులు సంక్రాంతి కళ కనిపించే రీతిలో వేసిన సెట్స్ ఆకట్టుకున్నాయి. స్థానికంగా ఉన్న పలువురు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి ఫొటోలను తీసుకుని సరదాగా గడిపారు. స్వీట్ షాప్ నిర్వాహకులు ఆరుబయటే సంప్రదాయ వంటకాలైన అరిసెలు, పొంగడాలు, బూరెలు, బొబ్బట్లు వేడివేడిగా అందించడంతో స్థానికులు వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. కాస్త ఆలస్యమైనా వేచి ఉండి మరీ తీసుకువెళ్లారు. జీవీఎంసీ 52, 90 వార్డుల పరిధిలోని పలు కాలనీల్లో ముగ్గులు పోటీలు నిర్వహించారు. మర్రిపాలెం వుడా లే అవుట్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కాలనీలోని గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. 52వ వార్డు శాంతి నగర్‌లో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కుటుంబ సమేతంగా సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. గంగిరెద్దులకు పూజలు చేసి, కానుకలను అందజేశారు.

– మల్కాపురం /గోపాలపట్నం/విశాఖ విద్య

సమాజ సేవలో భాగస్వాములవ్వాలి

కంచరపాలెం : సమాజసేవలో భాగస్వాములు కావాలని సిటీ వైడ్ శోభన్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ ముయ్యల పోలరావు పిలుపునిచ్చారు. కంచరపాలెం పరిధి రామ్మూర్తి పంతులపేటలో కొణతాల వెంకటరావు ఆధ్వర్యంలో మంగళవారం శోభన్‌బాబు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలరావు కేక్ కట్ చేసి మాట్లాడారు. సేవా సంఘం చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. శోభన్‌బాబు చిత్రంతో కూడిన క్యాలెండర్ అవిష్కరించారు. కార్యక్రమంలో కొణతాల వెంకటేశ్వరరావు, చిన్ని, మురళీరాజు, డి.ఎస్.విజయకుమార్, డి.వెంకటరావు, ఎం.సూర్యనారాయణ, పల్లా పైడిరాజు యాదవ్, జి.ఫణిభూషణరావు, కె.సూర్యరత్నం, పి.దేవకి, టి.సూరిబాబు పాల్గొన్నారు.



శోభన్‌బాబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు



పండగ సందర్భంగా రద్దీ లేక వెలవెలబోతున్న రహదారులు



పారిశ్రామిక ప్రాంతంలో నిర్మానుష్యంగా ఉన్న సర్వీస్ రోడ్డు

రహదారులు నిర్మానుష్యం

సంక్రాంతి పండగకు అందరూ స్వగ్రామాలకు వెళ్లడంతో నగరం చాలావరకు ఖాళీ అయింది. పారిశ్రామిక ప్రాంతం, గోపాలపట్నం తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. అక్కడక్కడా కొన్ని ద్విచక్రవాహనాలు ఆటోలు మాత్రం కనిపించాయి. మరో రెండు రోజులు దాదాపు ఇదే పరిస్థితి ఉండవచ్చని దుకాణదారులు, స్థానికులు అంటున్నారు.

– గోపాలపట్నం/మల్కాపురం

అసంపూర్తి పనులతో అవస్థలు



ప్రకాష్‌నగర్ సర్వీస్ రోడ్డులో సరిగ్గా పూడ్చని గొయ్యి

ఫోకస్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్‌నగర్ నుంచి ఇండస్ట్రియల్ కాలనీకి వెళ్లే సేవా మార్గంలో ఇటీవల జీవీఎంసీ నీటి సరఫరా సిబ్బంది గోతిని తవ్వారు. దానిని సరిగ్గా పూడ్చకపోవడంతో మట్టి ఎత్తుగా పేరుకుని, ఆ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వారు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయంలో ఈ మార్గంలో వీధి లైట్లు వెలగకపోవడంతో ఆ మట్టిదిబ్బను తన్నుకుని పలురువు గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అంబికాబాగ్ రామాలయంలో గోపూజ



గోవులకు పూజలు చేస్తున్న ఆలయ పర్యవేక్షకుడు

డాబాగార్డెన్స్: జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేటలో వెలసిన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో కనుమ పండగను పురస్కరించుకుని గోవులకు సాంప్రదాయ రీతిన గోపూజ నిర్వహించారు. అక్కడి గోశాలలో గల పలు గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల చేతుల మీదుగా ఆహారం అందించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు తిరుపతిరావు, దేవాలయ అర్చకుడు బాలసుబ్రహ్మణ్యం (బాలు), సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రోజూ పండగే..

- ఇక పరసల పరంపర
- శివరాత్రి వరకు తీర్థాల సందడి



పూజలు అందుకున్న ప్రసన్న వినాయకుడు



పరసల సందడి ఇలా..



పరసలో ఆటవస్తువులు కొనుగోలు చేస్తున్న ప్రజలు



భజన చెట్టు వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు



అలరించిన కోలాటం

కంచరపాలెం: నగరంలో పరసల సందడి ప్రారంభమైంది. సంక్రాంతి మొదలుకుని శివరాత్రి వరకు జరిగే ఈ పరసలతో ప్రతి రోజూ పండగే అన్నట్లుగా ఉంటుంది. గ్రామీణ ప్రాంతాలలో తీర్థాలుగా వ్యవహరించే వీటిని శ్రీరామలీలా పరసల పేరిట ఏటా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. నగరంలో దాదాపు అన్ని ప్రాంతాలలోనూ ఈ ఉత్సవాలు రోజూ కనిపిస్తుంటాయి. ఈ సందర్భంగా సాముగరిడీ, తప్పెటగుళ్లు, కోలాటం తదితర ప్రదర్శనలు ఆకట్టుకుంటాయి. మర్రిపాలెం, కరాస, తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ, అల్లిపురం తదితర ప్రాంతాలలో పరసలు కోలాహలంగా జరుగుతున్నాయి. మంగళవారం జాషువానగర్ ప్రసన్న వినాయక ఆలయంలో, బుధవారం గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం శ్రీసీతారామఅభయాంజనేయ ఆలయంలో, గురువారం రామ్మూర్తి పంతులపేట గౌరీ సంఘం సీతారామాలయంలో, శుక్రవారం కొత్త రెడ్డి కంచరపాలెం గ్రామ సంఘం సంతోషిమాత ఆలయంలో, సోమవారం 104 ఏరియా మర్రిపాలెం గౌరీ సంఘం సీతారామశివాలయ ప్రాంతాల్లో వేర్వేరుగా ఈ పరసలు జరగనున్నాయి.

సందడే సందడి..

పరసలో పులివేషాలు, తప్పెటగుళ్లు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి నెలకొంటుంది. స్టాల్స్‌లో పిల్లలు ఆడుకునే రకరకాల బొమ్మలతో పాటు ఖర్జూరం, పంచదార కోడిపుంజులు, పానీపూరీ, హల్వా, హాట్ చాట్, ఐస్‌క్రీమ్ వంటి తినుబండారాలు విక్రయిస్తారు.

కనులపండువగా ప్రసన్న వినాయక తీర్థం

కంచరపాలెం జాషువా నగర్‌లో ప్రసన్న వినాయక తీర్థమహోత్సవం మంగళవారం కనులపండువగా జరిగింది. గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ చైర్మన్ గుమ్మిడి అచ్చిబాబు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, మాజీ కార్పొరేటర్లు కొప్పల వెంకటరావు, బొట్టా ఈశ్వరమ్మ, గొల్ల కంచరపాలెం అధ్యక్షుడు పల్లా సత్యనారాయణ, ఐదవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ చంద్రశేఖర్ ఐఎన్‌టీయూసీ నాయకుడు ఎం.కొండబాబు తదితరులు హాజరై, భజన చెట్టు వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. వీధులన్నీ విద్యుద్దీపాలతో కళకళలాడాయి. ఏడు గ్రామాల సఖ్యతను చాటి చెప్పే భజన చెట్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంఘం గౌరవ అధ్యక్షుడు గొటువాడ నరసింగరావు, అధ్యక్షుడు అలమండ ప్రసాద్, కార్యదర్శి గుమ్మిడి ఆదినారాయణమూర్తి(ఆదిబాబు) ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శ్రీరామలీలా పరస

56వ వార్డు గవరకంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘంలో శ్రీరామలీలా తీర్థ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు మళ్ల రామ్‌ప్రసాద్, మళ్ల రమేష్‌గారి ఆధ్వర్యంలో కేంద్ర గౌరీ సంఘం అధ్యక్షుడు బుద్ద శివాజీ, కార్పొరేటర్ ఎస్.ఆర్.శేఖర్ భజన చెట్టు వద్ద జ్యోతిని వెలిగించారు. సంక్రాంతి కళ ఉట్టిపడేలా రంగుల ఉప్పుతో రంగవల్లిక వేసి భజన చెట్టును ఏర్పాటు చేశారు. సాము గరిడీలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కాళ్ల రామగోవింద్, మళ్ల అనిల్‌కుమార్, కాళ్ల సత్యనారాయణ, పెంటకోట శివ ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ ఖాళీ



నిత్యం రద్దీగా ఉండే ద్వారకా బస్ స్టేషన్ ముఖ ద్వారం ఇలా..

డాబాగార్డెన్స్: ఆర్టీసీ కాంప్లెక్స్ ఖాళీ అయింది. సంక్రాంతి పండగ సందర్భంగా విశాఖలో నివాసముంటున్న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, అమలాపురం, పాలకొండ, కాకినాడ, రాజమండ్రి తదితర ప్రాంతాల వాసులు విశాఖ నుంచి వారి వారి ప్రాంతాలకు తరలి వెళ్లడంతో నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ కాంప్లెక్స్ వెలవెలబోయింది. నిన్న మొన్నటి వరకు విపరీతమైన రద్దీతో కిటకిటలాడిన కాంప్లెక్స్ ఒక్కసారిగా బోసిపోయింది. ప్రయాణికుల కోసం బస్సులు ఎదురు చూస్తున్నాయి. మరికొంత మంది కండక్టర్లు, డ్రైవర్లైతే శ్రీకాకుళం.. రాజమండి నర్సీపట్నం.. అంటూ కేకలు వేస్తూ ప్రయాణికులను ఆహ్వానిస్తున్నారు. టికెట్ కౌంటర్ కూడా బోసిపోవడంతో ఆర్టీసీ కాంప్లెక్స్ అంతా నిర్మానుష్యంగా మారింది.

కదిలే బొమ్మల కమ్మని కబుర్లు



కదులుతూ కబుర్లు చెప్పేవి తోలుబొమ్మలు. సినిమాలు, టీవీలు లేని రోజుల్లో జనసామాన్యానికి ఇవే వినోద సాధనాలు. తెరలు కట్టి.. ఆ తెరల వెనుక నుంచి సన్నని దారం సాయంతో వీటిని తోలు బొమ్మలాటగాళ్లు కదిలిస్తూ.. రామాయణ, భారత, భాగవతాల్లోని ఘట్టాలను ప్రదర్శిస్తూ ఉపాధి పొందేవారు. తర్వాతి కాలంలో ఇవి కనుమరుగయ్యాయి. ఈ తరం వారికి వీటి గురించి తెలియదు. మళ్లీ ఇవి ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి. నగరంలో పలు చోట్ల ఫుట్‌పాత్‌లపై వీటిని విక్రయిస్తున్నారు.

– జగదాంబ